


చంద్రబాబు చేతుల మీదుగా బీ ఫామ్‌లు అందుకున్న నాని, థామస్, వరప్రసాదరావు, భానుప్రకాష్, జగన్మోహన్, మురళీమోహన్

గెలుచుకుని రండి

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ ఫామ్ అందజేసిన చంద్రబాబు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 21: గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదివారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన చేతుల మీదుగా వారికి బీ ఫారాలు అందించారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, చంద్రగిరి, గంగాధరనెల్లూరు, నగరి, చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు పులివర్తి నాని, థామస్, గాలి భానుప్రకాష్, గురజాల జగన్మోహన్, కలికిరి మురళీమోహన్ బీ ఫారాలు అందుకున్నారు. అనంతరం చంద్రబాబు అభ్యర్థుల చేత ప్రమాణం చేయించారు. ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వం, సీఎం జగన్ అప్రజాస్వామిక పాలనను ప్రజలకు వివరించా లన్నారు. విజయంతో తిరిగిరావాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ గడువు 23 వరకు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 21 : పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునేందుకు కల్పించిన అవకాశాన్ని 23వ తేదీ వరకు పొడిగించినట్లు కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బందికి జిల్లాలో ఓటుహక్కు ఉంటే వినియోగించుకునేందుకు ఫారం-12 పూరించి, ఈ నెల 23వ తేదీలోగా ఆయా శాఖల హెచ్‌వోడీలకు అందజేయాలని పేర్కొన్నారు. గతంలో 22వ తేదీ వరకు ఉన్న ఈ అవకాశాన్ని పలువురు ఉద్యోగుల విన్నపం మేరకు ఒకరోజు పొడిగించామని వివరించారు. ఇతర జిల్లాలకు చెందిన అధికారులు, సిబ్బంది చిత్తూరు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నట్లయితే అట్టివారు ఫారం-12, అనెగ్జర్ 12(ఇ)ని హెచ్‌ఓడీల ద్వారా కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు. గడువులోగా ఫారాలు అందించకుంటే వారు సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాల్సి ఉంటుందని వివరించారు. అటువంటి వారికి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే వెసులుబాటు ఉండదని తెలిపారు.

నేడు టెన్త్ ఫలితాలు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 21 :టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాలు సోమవారం వెల్లడి కానున్నాయి. గత నెల 18 నుంచి 30వ తేదీ వరకు జరిగిన పరీక్షలు జిల్లాలో 22,594 మంది విద్యార్థులు రాశారు. ఇందులో రెగ్యులర్ 21,199 మంది, ప్రైవేటు 1,395 మంది ఉన్నారు.

జేఈఈ మెయిన్స్ సెషన్-2 ఫలితాలు కూడా : జేఈఈ మెయిన్స్ సెషన్-2 ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. ఈనెల నాలుగు నుంచి 12వ తేదీ వరకు ఆరు రోజులు పాటు జరిగిన పరీక్షలకు జిల్లాలోని 823 మంది విద్యార్థులు హాజరయ్యారు.

వందశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక తరగతులు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 21: హైస్కూల్ ప్లస్ ఇంటర్ విద్యార్థులకు వేసవిలో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు.జిల్లాలోని 20 హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఇంటర్‌లో 531 మంది విద్యార్థులకుగాను 117 మంది (22 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 414 మంది ఫెయిలయ్యారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఫెయిలైన విద్యార్థులకు ఆయా సబ్జెక్టు టీచర్లు శిక్షణ ఇవ్వాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

చిరుద్యోగులపై చిన్నచూపు

- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జగన్ మొండిచేయి
- మాట ఇచ్చి, తప్పడంపై అసంతృప్తి

'మేము అధికారంలోకి రాగానే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తాం.. జీతాలు పెంచి వారికి గౌరవప్రదమైన జీవితాన్ని ఇస్తాం..' ఇదీ 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా జగన్ చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ. ఈ మాట జిల్లాలోని వేలాది మంది చిరుద్యోగుల్లో ఆశలు నింపాయి. జగన్ సీఎం కాగానే తమ బతుకులు మారిపోతాయని సంబరపడ్డారు. వారి ఆశలకు తగినట్లే వైసీపీ అధికారంలోకి వచ్చింది. రేపు..ఎల్లుండి అంటూ కాలం గడిచిపోయింది. మళ్లీ ఎన్నికలు వచ్చాయి. కానీ వారికి ఇచ్చిన హామీని సీఎం పట్టించుకోలేదు. మాట తప్పను..మడమ తిప్పను అని పదేపదే చెప్పే జగన్ ఇలా చేయడంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. అరకొర వేతనాలతో వారు బతుకులు ఈడుస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కోస్ పథకం కింద జిల్లాలో వివిధ విభాగాల్లో 2వేల మంది పనిచేస్తున్నారు. సాంకేతిక కారణాలు, సీనియారిటీ దృష్ట్యా మెడికల్, అటవీ శాఖ, ఎన్‌ఆర్‌జీఎస్ తదితర శాఖల్లో మరో 500 మంది ఉన్నారు. వీరిలో ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారున్నారు. వీరికి ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ ద్వారా మూడు కేటగిరీల కింద రూ. 21వేలు, రూ.18వేలు, రూ.13వేలు జీతం ఇస్తోంది. కోతలు పోను వారి చేతికి తక్కువ మొత్తం అందుతుండడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది.

- చిత్తూరు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్ ఫొటో)

వారి డిమాండ్లు ఇవీ..

- ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.
- అర్హత కలిగిన వారిని పర్మినెంట్ చేయాలి. అలా కాని పక్షంలో కాంట్రాక్టు పద్ధతి కిందకు తీసుకోవాలి. మెడికల్, అగ్నిమాపక శాఖల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల లాగే హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు కావడం లేదు. లోపాలను సరిదిద్దాలి.
- కొన్ని శాఖల్లో జీతాలు ఆలస్యమవుతున్నాయి. ఆలస్యం లేకుండా చూడాలి.

సంక్షేమ పథకాల రద్దు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలను ప్రభుత్వం దూరం చేసింది. రూ.13 వేలున్న జీతానికి రెండువేలు పెంచి రూ.15వేలు చేశారు. ఆ తర్వాత వారికి సంక్షేమ పథకాలను రద్దు చేశారు. వికలాంగులు, వితంతువుల పెన్షన్లు రద్దయ్యాయి. అమ్మఒడి, విద్యా దీవెన రేషన్‌కార్డులను నిర్దాక్షిణ్యంగా తొలగించేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతున్నా ప్రభుత్వ ఉద్యోగులకు అందే సదుపాయాలేవీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించడం లేదు.

వికలాంగురాలి పెన్షన్ రావడం లేదు

బీసీ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పదేళ్లగా పనిచేస్తున్నాను. కటింగ్‌లు పోను రూ.13,600 జీతం వస్తుంది. మా అమ్మ ప్రమాదంలో గాయపడి వికలాంగురాలైంది. పెన్షన్ కావాలని దరఖాస్తు చేసుకుంటే నేను ప్రభుత్వ ఉద్యోగినంటూ మంజూరు కాలేదు. అరకొర జీతం.. దానికితోడు ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో కుటుంబం గడవటం కష్టంగా ఉంది.

- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి

నా బిడ్డకు అమ్మఒడి రాలేదు

కలెక్టరేట్‌లో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్నాను. బిడ్డకు అమ్మఒడి కోసం దరఖాస్తు చేశాను. సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు రావడంతో నన్ను ప్రభుత్వ ఉద్యోగిగా ఆన్‌లైన్‌లో చూపుతోంది. దాంతో ఆ స్కీము వర్తించడం లేదు. జీతం కుటుంబ అవసరాలకు చాలకపోగా సంక్షేమ పథకాలు కూడా వర్తించకపోతే ఎలా బతకాలి.

- మహిళా ఉద్యోగి

బోసిపోయిన వేలూరు రోడ్డు



పగలు 44.. రాత్రి 33 డిగ్రీలు

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు - ఆరెంజ్ జోన్‌లోకి గుడుపల్లి

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 21: ఈనెల ప్రారంభం నుంచే జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. 44 డిగ్రీలు దాటి పగటి ఉష్ణోగ్రతలు రికార్డు అవుతున్నాయి. రాత్రి వేళల్లో సైతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు పోటీపడుతున్నాయి. నాలుగైదు రోజులుగా రాత్రివేళ 30 నుంచి 33 డిగ్రీలకు పైగానే నమోదవుతున్నాయి. సాధారణం కంటే 3-5 డిగ్రీలు అధికం. రానున్న రోజుల్లోనూ రాత్రి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. శనివారం నింద్ర, పుంగనూరు మండలాలు ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లగా తాజాగా గుడుపల్లి ఆ జాబితాలో చేరింది. ఆదివారం గరిష్ఠంగా నింద్రలో 42.6, పులిచెర్లలో 42.4 పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే తవణంపల్లె 41.7, గుడుపల్లె 41.7, పెద్దపంజాణి 41.5, శ్రీరంగరాజపురం 41.4, గుడిపాల 41.2, పుంగనూరు 41.2, కుప్పం 40.7, సదుం 40.1, బంగారుపాళ్యంలో 40.1 డిగ్రీలు నమోదైంది. ఎండల కారణంగా జనం బయటకు రావడానికి భయపడుతున్నారు. తద్వారా వీధులన్నీ బోసిపోతున్నాయి.



పాత బస్టాండులో ఖాళీగా ఉన్న కూరగాయల దుకాణాలు



మధ్యాహ్న సమయంలో గొడుగు నీడన వెళుతున్న మహిళ

బోయకొండలో భక్తుల రద్దీ



ప్రత్యేకాలంకారంలో గంగమ్మ



దర్శనం కోసం క్యూలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, ఏప్రిల్ 21 : బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం తెలుగు రాష్ట్రాల నుంచే గాక తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలన్నీ నిండిపోయాయి. అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, పంచామృతాభిషేకాలు చేశారు. స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

మద్యం కేసు నుంచి తప్పించుకునే యత్నం

చిత్తూరు, ఏప్రిల్ 21 : మూడు రోజుల క్రితం నగరంలోని ఓ కారు షెడ్డులో దొరికిన మద్యం కేసు నుంచి తప్పించుకునేందుకు వైసీపీ నేత ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. కొంగారెడ్డిపల్లె పరిధిలోని ఓ కారు షెడ్డులో అక్రమంగా దాచిపుంచిన 170 కేసుల మద్యం పోలీసులకు దొరికింది. అధికార పార్టీకి చెందిన నేత షెడ్డు కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే దీని నుంచి తప్పించుకునేందుకు సదరు నేత కారు షెడ్డు ఉన్న స్థలాన్ని వేరొకరి పేరు మీద పాత తేదీలతో రెంటల్ అగ్రిమెంటును తయారు చేస్తున్నట్లు తెలిసింది.

డిన్నర్‌కు వెళుతూ తిరిగిరాని లోకాలకు..

చౌడేపల్లె, ఏప్రిల్ 21 : ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని బిల్లేరుగౌడుఇండ్లకు చెందిన రామకృష్ణ గౌడ్ కుమారుడు శ్రీనివాసులు(47) అదే గ్రామానికి చెందిన గురుమూర్తితో కలసి బైక్‌లో బోయకొండలో డిన్నర్‌కు బయలుదేరారు. మిట్టూరుకు చెందిన నరసింహులు కాగతి వద్ద ఉన్న మిల్లులో వడ్లు ఆడించుకుని ట్రాక్టర్‌లో తిరిగి వస్తున్నాడు. కాగతి నుంచి మిట్టూరుకు వెళ్లే మార్గంలో ట్రాక్టర్ ద్విచక్రవానాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందాడు. గురుమూర్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన శ్రీనివాసులు

నేడు రాళ్లబూదుగూరులో టీడీపీ ప్రచారం

శాంతిపురం, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని రాళ్లబూదుగూరు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి తెలిపారు. ఈ ప్రచారాలకు మండలంలోని తెలుగుదేశం కుటుంబ సభ్యులు హాజరై చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6 పథకాల గురించి ప్రజలకు వివరించాలని కోరారు.

ఎన్నికల వేళ వాహనాల తనిఖీ



కూర్మాయి క్రాస్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ చంద్రశేఖర్

పలమనేరు, ఏప్రిల్21 : ఎన్నికలవేళ అక్రమంగా మద్యం, నగదు, తమిళ నాడు నుంచి వచ్చే అవకాశాలు ఉండడంతో ఆదివారం ప్రత్యేక సిబ్బందితో పలమనేరు సీఐ చంద్రశేఖర్ వాహనాల తనిఖీ చేపట్టారు. పలమ నేరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో కూర్మాయి క్రాస్ సమీపంలో ఉద యం 7 గంటల నుంచి సుమారు మూడుగంటల పాటు వాహనాలను తనిఖీ చేశారు.

మహిళపై అత్యాచారయత్నం

శాంతిపురం, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని ఓ మహిళపై మణి అనే యువకుడు అత్యాచారానికి యత్నించాడు. ఆమె కథనం మేరకు.. బాధితురాలిని అతడు తరచూ వెంబడించి వేధించేవాడు. అతడి చేష్టలు భరించలేక భర్తకు చెప్పాలని భావించినా గొడవలు అవుతాయోమోనని మిన్నకుండిపోయింది. ఈ క్రమంలో ఆదివారం ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా అత్యాచారం చేయ బోయాడు. ఆమె అతడి బారి నుంచి తప్పించుకుని బయపడింది. అదేసమయంలో ఆమె భర్త రావడంతో జరిగినదంతా చెప్పి విలపించింది. భర్త అతడిని నిలదీయగా ఆయనపై దాడిచేశాడు. రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల



మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు వాడ గంగరాజు, ఓబుల్‌రాజు తదితరులు

పలమనేరు, ఏప్రిల్21 : పలమనేరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ ఎన్నికల మ్యాని ఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలోని వైసీపీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, డీజిల్, పెట్రోల్ ధరలకు నియంత్రణే లేకుండా పోయిందన్నారు. ఇందువల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఓబుల్‌రాజు, భువనేశ్వరి, గిరిధరగుప్తా, సురేంద్ర, ధనలక్ష్మి, లక్ష్మయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

ఘనంగా కుప్పం నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

కుప్పం, ఏప్రిల్ 21: బీసీఎన్ విద్యా సంస్థలలో ఒకటైన కుప్పం నర్సింగ్ కళాశాల వార్షికోత్సం ఆదివారం ఘనంగా జరిగింది. బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్, శాంతనాగరాజ్ దంపతులు, వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సీఈవో సాగర్‌రాజ్‌లు జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తిలో సేవాభావం, శాంతం, సహనం చాలా అవసరమ న్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విమల జోసఫ్, అధ్యాపక బృంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం



భక్తులకు ఆధ్యాత్మిక గ్రంథాలు పంపిణీ

కుప్పం, ఏప్రిల్ 21: కుప్పంలోని కుప్పం -పలమనేరు బైపాస్ రోడ్డులో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథాల యాన్ని ప్రబోధ సేవా సమితి కుప్పం కమిటీ అధ్యక్షులు కృష్ణ, సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు కొన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు.

వైభవంగా రథోత్సవం



రథం లాగుతున్న భక్తులు, (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

చిత్తూరుకల్చరల్, ఏప్రిల్21: నగరంలో ప్రాశస్త్యం పొందిన కోదండ రామాలయంలో ఎనిమిది రోజులుగా శ్రీరామనవమి ఉత్సవాలు వైభవం గా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వి.ఆర్ రాజేశ్వరి, వి.ఎస్. రఘుపతి శెట్టిల ఉభయంతో రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మూలవర్లను రథంపై అధిష్ఠింపచేసి మాడవీథులు, చర్చివీధి, మార్కెట్ చౌక్, బజారు వీధి, హైరోడ్డు, గాంధీచౌక్‌ల గుండా ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు తమ లోగిళ్ల ముందు పసుపునీటితో స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు పలికారు. శ్రీరామభక్తులు, విశ్వహిందూపరిషత్ సభ్యుల జైశ్రీరామ్ నినాదాలతో నగరం మారుమోగింది. భక్తులు బొరుగులు, ఉప్పు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో సుబ్రమణ్యంనాయుడు, అర్చకుడు వేణుగోపాల్, పాలకమండలి మాజీ ఛైర్మన్లు నందగోపాల్‌శెట్టి, సకల వెంకటేశం గుప్తాతో పాటు ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.టి.రంగనాథన్ వీహెచ్‌పీ నాయకులు వేలు, మురళి తదితరులతోపాటు భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం దారి వెంబడి దాతలు భక్తులకు చల్లటి మజ్జిగ, తాగునీరు, అన్నదానం చేసారు. సాయంత్రం స్వామివారికి వి.నాగేంద్రప్రసాద్, కె.జగదీశ్ కుమార్ ఉభయంతో తోట ఉత్సవం నిర్వహించారు. సోమవారం స్వామివారికి పల్లకిలో వెన్నకృష్ణుడి అలంకారం, అశ్వ వాహనసేవ నిర్వహించనున్నారు.

అమర్ రెండో విడత నామినేషన్‌కు భారీ ఏర్పాట్లు

పలమనేరు, ఏప్రిల్ 21 : పలమనేరు నియోజకవర్గం నుంచి నాల్గవసారి ఎన్నికల బరిలో దిగుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఈ నెల 22న తన ఎన్నికల నామినేషన్‌ను రెండవ విడత వేయనున్నారు. నియో జకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా నాయ కులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంస్థనాయకులు, అభిమానులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత పలమనేరు సత్యగంగమ్మ ఆల యం వద్ద పూజలు చేశాక ర్యాలీగా వచ్చి వీవీమహల్ రోడ్డులో బహిరంగసభలో అమర్‌నాథరెడ్డి ప్రసంగించ నున్నారు. తర్వాత నామినేషన్ దాఖలు చేయనున్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం



పుదిపట్లలో ప్రచారం చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి

చౌడేపల్లె, ఏప్రిల్21: సంక్షేమం అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుకే సాధ్యం అని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మండలంలోని పుదిపట్ల, తిరువనపల్లె, అమరకృష్ణాపురం, మిట్లూరు తదితర గ్రామాలలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అప్పుల ఆంధ్రాను అభివృద్ధి పథంలో నడిపించాలన్నా.. అర్హులందరికీ సంక్షేమం అందాలన్నా ఏన్‌డీఏ ప్రభుత్వం రావాలన్నారు. నవ్యాంధ్ర పునర్నిర్మాణం చంద్రబాబుకే సాధ్యమన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డికి సైకిల్ గుర్తుపై, రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రశాంత పుంగనూరు కోసం నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టి కృషితో పనిచేసి ఎన్‌డీఏ కుటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, చదువుకునే ప్రతి బిడ్డకూ ఏడాదికి రూ.15వేలు, ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తారని వివరించారు. వృద్ధులకు రూ.4వేల పింఛను, దివ్యాంగులకు రూ.6వేలు పింఛను ఇస్తారని తెలియజేశారు. పింఛన్లు ఇంటి వద్దకే చేర్చుతారని తెలియజేశారు. ఇక వలంటీర్లకు రూ.10వేల వేతనం ఇస్తారని పేర్కొన్నారు. ఇలా సంక్షేమంతో పాటు రాష్ట్రానికి రాజధాని నిర్మించి పోలవరం పూర్తిచేస్తారని తెలిపారు. ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, నాయకులు లక్ష్మీపతిరాజు, పురుషోత్తమరాజు, చంద్రవదనమ్మ, విజయలక్ష్మి, వినోద్‌కుమార్‌రెడ్డి, రెడ్డెప్ప, బాబు, పార్థసారథి, కల్యాణ్, బోయకొండ సుబ్బు, మునెంకటప్ప, శివన్న, గిరిరాజు, ప్రభాకర్, బీజేపీ నాయకులు చిన్నకిశోర్, గంధోడి ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, జనసేన నాయకులు హేమంత్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రయ్యకు చల్లా సుప్రియరెడ్డి నివాళులు



ఎర్రయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి సతీమణి సుప్రియరెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 21: రొంపిచెర్ల మండలం బండకిందపల్లె పంచాయతీ హనుమంతరాయనిపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఎర్రయ్య ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పుంగనూరు నియోజక వర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సతీమణి సుప్రియరెడ్డి వారింటికెళ్లారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమణ, భాస్కర, చంద్రారెడ్డి, వెంకటరమణరెడ్డి, హసన్ బాష తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ భరత్ ప్రోద్బలంతో ముస్లిం దంపతులపై దాడి



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నేతలు

రామకుప్పం, ఏప్రిల్ 21: ఎమ్మెల్సీ, కుప్పం వైసీపీ అభ్యర్థి భరత్ ప్రోద్బలంతోనే 89 పెద్దూరులో ముస్లిం దంపతులపై దాడి జరిగిందని టీడీపీ కుప్పం పరిశీలకులు గాజుల ఖాదర్‌బాష పేర్కొన్నాడు. ఆదివారం రామకుప్పంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నామినేషన్ ర్యాలీలో 89 పెద్దూరుకు చెందిన నస్రూల్ వచ్చాడని కక్షతో వైసీపీ నేతలు అతనితో పాటు వారి కుటుంబంపై దాడికి పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. నస్రూల్‌ను, ఆయన భార్యను ఇంట్లోంచి లాగి, దుర్భాషలాడుతూ చంపేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. నిత్యం ముస్లింలపై కపట ప్రేమ చూపిస్తున్న జగన్ ఈఘటనపై స్పందించక పోవడం చూస్తే ఆయనకు ముస్లింలపై ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవాలన్నారు. కుప్పంలో టీడీపీకి అండగా ఉన్న ముస్లింలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేసి తమ వైపు తిప్పుకోవాలని వైసీపీ వారు చూడటం సరికాదన్నారు. నస్రూల్ కుటుంబానికి వైసీపీ వారి నుంచి ప్రాణహాని ఉందని, వారికి ఏమిజరిగినా ఎమ్మెల్సీ భరత్ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అధికార నేతల అండతో పోలీసులు కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్‌కు, రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రామకుప్పం మండల పార్టీ అధ్యక్షులు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షులు ఆంజినేయరెడ్డి, మాజీ జడ్పీటీసీ మునస్వామి, మైనారిటీ సెల్ అధ్యక్షులు జాకీర్, నేతలు సర్దార్, అన్సర్, రఫీ, ఆదిల్‌బాష, చాన్‌బాష తదితరులు ఉన్నారు.

బీసీవై పార్టీతోనే పుంగనూరు అభివృద్ధి



ఆరడిగుంటలో ప్రచారం చేస్తున్న బీసీవై పార్టీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్21: పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధి బీసీవై పార్టీ తోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఆరడిగుంట, వనమలదిన్నె, సింగిరిగుంట పంచాయతీలో విస్తృతంగా పర్యటించారు. బీసీవైపార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే పేదల భూములు ఆక్రమించుకుందన్నారు. అక్రమ కేసులతో భయందోళనలు సృష్టించడం, ప్రభుత్వం భూములను ఆక్రమించుకుని విక్రయించుకుందని ఆరోపించారు. గ్రామాల్లో ప్రజలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలల్లో నామినేషన్ వేయనీయకుండా వైసీపీ నాయకులు చేసిన దౌర్జ న్యాలు ప్రజలు గుర్తించుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీసీవై పార్టీని గెలిపిస్తే ప్రతి ఇంటికీ ఆవు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమలు స్థాపించడా నికి కృషిచేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, మహిళలు, యువత అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సీతారాముల విగ్రహ ప్రాణప్రతిష్ఠ



విశేష అలంకరణలో పూజలందుకుంటున్న సీతారాములు

కల్లూరు, ఏప్రిల్ 21: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ కురవపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున విష్వక్సేనారాధన, భగవతారాధన, లక్ష్మీనారాయణహోమం, సుదర్శన హోమం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి పూజలు నిర్వహిం చారు. ఉదయం 8 గంటలకు సీతారాముల విగ్రహ ప్రాణప్రతిష్ఠ కుంభాభిషేకం వేడుకలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా జరిపించారు. అనంతరం పురవీధుల్లో పుష్పపల్లకిపై సీతారామ దంపతులు ఊరేగుతుండగా భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లకు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అనంతకుమారాచార్యుల బృందం, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీనాథరెడ్డి దంపతులను కలిసిన పెద్దిరెడ్డి

● వైసీపీలోకి రావాలని ఆహ్వానం

పుంగనూరు, ఏప్రిల్ 21: టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎన్.శ్రీనాథ్‌రెడ్డి, ఆయన సతీమణి, పుంగనూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి ఎన్.అనీషారెడ్డిలను ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కలిశారు. మదనపల్లెలో శ్రీనాథ్‌రెడ్డి స్వగృహంలో వీరిద్దరూ దాదాపు అరగంటసేపు చర్చించారు. తెలుగుదేశం పార్టీ నుంచి వైసీపీలోకి రావాల్సిందిగా ఆహ్వానించి, సీఎం జగన్మోహన్‌రెడ్డితో మాట్లడించినట్లు తెలిసింది. 2019 ఎన్నికల్లో పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి అనీషారెడ్డి ఓటమి చెందిన విషయం తెలిసిందే.

రైతులకు మేలు చేసిందేమిటి?

ప్రభుత్వానికి చెరకు రైతుల సూటిప్రశ్న

నగరి ఏప్రిల్21: సీఎం జగన్ రైతుల పక్షపాతి అని చెప్పడమే తప్ప ఆయన ప్రభుత్వ హయాంలో చెరకు రైతులకు చేసిందేమిటని ప్రశ్నిస్తున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ సమీపంలో గల మయూర చక్కెర కర్మాగారం ఐదేళ్ల క్రితం మూతబడగా నేటికీ రైతులకు రూ.18 కోట్లు బకాయిలు చెల్లించలేదు. అలాగే నింద్ర పరిధిలోని నేతమ్స్ చక్కెర కర్మాగారం పరిధిలోని ఏడు మండలాల రైతులకు రూ.36 కోట్ల బకాయిలు ఆగిపోయాయి. రైతులు ఏడాది కష్టపడి పండించిన పంటను క్రషింగ్‌కు తరలించి ఐదేళ్ల పూర్తయినా బిల్లులు రాక పోవడంతో అప్పులపాలై కూలీలుగా మారారు. నగరి మండల పరిధిలోని అయనం బాకం గ్రామానికి చెందిన చెరకు రైతు శేషగిరి తన 12 ఎకరాల పొలాన్ని అమ్మి అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంత్రి రోజా దృష్టికి చెరకు రైతు సంఘ నాయకులు పలుసార్లు తీసుకువచ్చినా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు జిల్లాలో నాడు నాలుగు ప్రైవేటు పరిశ్రమలు, రెండు సహకార రంగంలో పరిశ్రమలుండేవి. నేడు కేవలం ఒకే పరిశ్రమ ఉండటంతో చెరకు రైతులు దళారుల చేతులలో దగా పడుతు న్నారు. పైసా మిగలక పోయినా పర్వాలేదు, సాగైన పంట బయటకు వెళితే చాలు అన్న రీతిలో 2023–24 క్రషింగ్ సీజన్‌లో తీవ్ర నష్టాలకు గురయ్యారు. ఇదేనా రైతుల పక్షపాతి ప్రభుత్వమంటే జగన్‌రెడ్డి, రోజా మేడమ్ అని రైతులు వాపోతున్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు



కుప్పం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చంద్రమ్మ

కుప్పం, ఏప్రిల్ 21: నిత్యం భర్త తనను వేధింపులకు గురి చేస్తున్నాడని చంద్రమ్మ అనే వివాహిత ఆదివారం కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని ఫైబాటకు చెందిన పరమశివకు, గుడుపల్లె మండలం కనమనపల్లెకు చెందిన చంద్రమ్మకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే పరమశివ రెండో పెళ్లి చేసుకున్నాడు. ఈ క్రమంలో మూడేళ్లుగా అతను తన కుటుంబ సభ్యులతో కలిసి చంద్రమ్మను వేధింపులకు గురి చేస్తున్నాడు. శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. గతంలో రెండుమార్లు భర్త పరమశివ వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. అప్పుడు బాగా చూసుకుంటానని చెప్పి, తిరిగి వేధిస్తున్నాడు. భర్త వేధింపులకు గురైన చంద్రమ్మ ఆదివారం చికిత్సకోసం కుప్పం ప్రభుత్వాసుపత్రిలో చేరింది. భర్త వేధింపుల నుంచి రక్షించి పోలీసులు తనకు న్యాయం చేయాలని బాధితురాలు కోరుతోంది.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై కేసు నమోదు

రామకుప్పం, ఏప్రిల్ 21: ఎన్నికల నియమావళి అమలులో ఉండగా ముందస్తు అనుమతులు లేకుండా రామకుప్పం మండలం రాజుపేటలో చంద్రబాబు జన్మదిన వేడుకలు పబ్లిక్ ప్లేస్‌లో నిర్వహించిన ఏడుగురు టీడీపీ నేతలపై రామకుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. రామకుప్పం ఏఆర్వో ఈశ్వరన్న ఫిర్యాదు మేరకు రాజుపేటకు చెందిన కేవీ.నారాయణస్వామి, ఎం. నరసింహులు, ఎం. వెంకటస్వామి, శశికుమార్, జగపతి, అప్సర్, రమణలపై 188 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద 106 -2024గా కేసు నమోదు చేశారు.

89 పెద్దూరు ఘటన..ఇరు వర్గాలపై కేసు

రామకుప్పం, ఏప్రిల్ 21: రామకుప్పం మండలం 89 పెద్దూరులో శనివారం సాయంత్రం వైసీపీ కార్యకర్త నస్రూల్, నసీమా దంపతులపై అదే పార్టీకి చెందిన నేతలు దాడి చేశారు. శుక్రవారం చంద్రబాబు నామినేషన్ ర్యాలీలో అతను పాల్గొన్నాడని ఈ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై శనివారం రాత్రి నస్రూల్ భార్య నసీమా వైసీపీకి చెందిన పది మందిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదేసమయంలో వార్డు సభ్యుడు రమేష్ భార్య కాంతమ్మ సైతం నస్రూల్‌తో పాటు వారికి చెందిన పది మందిపై ఫిర్యాదు చేసింది. ఏం జరిగిందో ఏమోకానీ మహిళలు ఇచ్చిన ఫిర్యాదులను పోలీసులు పక్కన పెట్టారు. తర్వాత నస్రూల్, రమేష్‌లు పరస్పరం చేసుకున్న ఫిర్యాదుల మేరకు నస్రూల్, అతని తమ్ముడు అబ్దుల్లాపై ఓ కేసు, రమేష్ సత్యాలపై ఎస్ఐ శివకుమార్ మరో కేసు నమోదు చేశారు.

బ్రాహ్మణులపై దాడి శోచనీయం



విలేకరులతో మాట్లాడుతున్నబ్రాహ్మణ సంఘనాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్21: పిఠాపురంలో పెండ్లి పందిరిలో బ్రాహ్మణులపై దాడి చేసి అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పుంగనూరు బ్రాహ్మణ సంఘ కార్యదర్శి రామమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు బ్రాహ్మణులకు రక్షణ కల్పించాలని కోరారు. సంఘ నాయకులు బాబు, శివకుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రభాకర్

పుంగనూరు రూరల్, ఏప్రిల్21: పేద ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థను ముందుకు తీసుకెళ్లడానికి ఆర్థిక వనరులు అవసరమని, దాతల ద్వారా రుణాలను సేకరించాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం ఫ్రీజర్ బాక్స్‌లు, వైకుంఠ రథం తదితర వాటిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భవన నిర్మాణానికి కూడా నిధులు అవసరముందన్నారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు నరిసంహారెడ్డి, ఏసీ నారాయణరెడ్డి, వెంకటముని, చెంగారెడ్డి, జగన్, సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూతగాదాపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, ఏప్రిల్21: భూతగాద కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నరిసింహులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన సబీనాబేగానికి అదే ప్రాంతానికి చెందిన బావాజాన్, సభానా, అహ్మద్, పర్వీన్, నగీనాలు ఇంటి స్థలం కోసం వాగ్వాదం జరిగింది. అది ఘర్షణకు దారితీసింది. సబీనా బేగానికి గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభినవ శబరికి సన్మానం



తాయమ్మను సన్మానిస్తున్న స్థానికులు

పలమనేరు, ఏప్రిల్21 : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పలమనేరు బజారు వీధిలోని సీతారామాంజ నేయ స్వామి ఆలయంలో స్వామివారి భక్తురాలు అభినవ శబరి తాయమ్మను శాలువకప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. తాయమ్మ దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా స్వామివారి ఆలయ ప్రాంగణంలోనే నివాసముంటూ ఉదయం, సాయంత్రం ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు ప్రతిరోజూ ఆలయంలో కళ్లాపు చల్లి ముగ్గులు వేస్తూ ఉంటుంది. భక్తులు విశేషరోజుల్లో ఇచ్చే చిరుకాసులతో జీవనం సాగిస్తోంది. తాయమ్మ నేటి అభినవ శబరిగా స్థానికులు భావిస్తున్నారు. ఆదివారం యోగాగురువు నందగోపాల్ రామభక్తులు మధుమోహన్ రావు, గోవిందస్వామి ఆమెను సన్మానించారు.

సారా స్థావరాలపై దాడి

500 లీటర్ల సారా ఊట, తయారీ పరికరాలు ధ్వంసం



అడ్డగట్టుతాండాలో సారా ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

రామకుప్పం, ఏప్రిల్ 21: రామకుప్పం మండలం అడ్డగట్టతాండ, కొర్నాటలతాండా పరిసరాలోని అటవీ ప్రాంతాలో ఉన్న సారా స్థావరాలపై ఎస్ఐ శివకుమార్ తమ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడులో సుమారు రూ.42,500 విలువ గల 500 లీటర్ల సారా ఊటను, తయారీకి ఉపయోగించే పరికరాలను ధ్వంసం చేశారు. సారా తయారీకి పాల్పడే వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలు జరిపేవారిపైనా కఠిన చర్యలు తప్పవన్నారు.


ఇదీ మందు



వైసీపీకి రాకుంటే కేసే

వైసీపీలోకి వస్తావా... రావా... అని అలుపెరగకుండా పార్టీలోకి పిలుస్తూనే ఉన్నారు. టీడీపీ వదిలి నేను రాను సామీ.. ఉన్నతావులోనే కుదురుగా ఉంటా అని ఆయనా చెబుతూనే ఉన్నాడు. సామదాన భేద దండోపాయాలు తెలిసిన నాయకులు కదా మన తిరప్తోళ్లు.. పిలిచీ పిలిచీ ఇంకన దండోపాయానికి దిగారు. కేసుల మింద కేసులు పెడుతూ ఇప్పటికన్నా రా..బ్బా అని పిలుస్తూనే ఉన్నారు. ఈ కత తిరుపతి 50వ డివిజన్ తిమ్మినాయుడుపాళెం దళితవాడలో జరతగా ఉండాది. ఇక్కడ కాయం వెంకటరత్నం అనే తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉన్నారు. పిలిస్తే పలికే నాయకుడిగా డివిజన్‌లో పేరుంది. మంచి అనుచరులున్నారు. వెంకటరత్నంతో పాటు వీరందరినీ వైసీపీలోకి రమ్మని పిలుస్తున్నారు. రాకపోవడంతో కేసులు పెట్టిస్తున్నారు. దళితవాడలో వైసీపీ వర్గం ద్వారా చిన్నపాటి గొడవలు సృష్టించి తర్వాత పెద్దవిగా చేయడం.. వాటిల్లో టీడీపీ సానుభూతిపరులపైనే కేసులు బనాయించడం చేస్తున్నారు. 2019లో ఒకటి, 2020లో రెండు, 2023లో నాలుగు కేసులు పెట్టించారు. 30మంది టీడీపీ సానుభూతిపరులు, పదిమంది మహిళలూ ఇప్పటికే బాధితులయ్యారు. పెడితే పెట్టుకోండి కేసులు.. అంటూ వీరంతా వెరవకుండా గట్టిగా నిలబడ్డారు.

-తిరుపతి (జీవకోన)



పార్టీ పాయ పేరూ పాయ!

రాజకీయాల్లో ఓడలు బండ్లవడం సహజమే. సూళ్లూరుపేట నియోజకవర్గంలో టీడీపీ అంటేనే ఆ కుటుంబంగా, ఆ కుటుంబం అంటేనే టీడీపీగా దశాబ్దాల పాటు నడిచింది. టీడీపీ ఆవిర్భావం నుంచీ ఏ ఎన్నికల్లో అయినా వారు చెప్పినవారికే టికెట్ ఇవ్వడం ఆనవాయితీగా నడిచింది. ఆ కుటుంబంలో అన్న మరణించాక తమ్ముడు ఆ వారసత్వాన్ని కొనసాగించారు. నియోజకవర్గంలో ఆయన మాటే శాసనంగా నడిచింది. ఆయనకు జిల్లా స్థాయిలో మంచి పదవి కూడా పార్టీ ఇచ్చింది. అయితే టీడీపీ అధికారం కోల్పోవడంతోనే వారి తీరు మారిపోయింది. వేధింపులు, కేసులతో దూకుడు ప్రదర్శించిన వైసీపీని ఎదుర్కోలేక తెరమరుగైపోయారు. కేసులు ఎదుర్కొనే పార్టీ శ్రేణులకు అండగా ఉండలేదు. దాంతో కేడర్ కూడా ఆ నాయకుడితో సంబంధం లేకుండా ముందుకు నడవడం అలవాటు చేసుకున్నారు.ఉలుకూ పలుకూ లేకుండా మాయమైపోయిన ఆయన హఠాత్తుగా ఎన్నికలకు ముందు నేనొచ్చేశానోచ్! అంటూ ఊడిపడ్డారు. పార్టీ పగ్గాలు ఎవరూ అప్పగించకుండానే చేతికి తీసుకున్నట్టుగా మాట్లాడారు. మళ్లీ టీడీపీ పునర్వైభవం చూస్తారని చెప్పారు.అటు పార్టీ అధిష్టానం గానీ, ఇటు స్థానిక నాయకులు గానీ ఆయన మాటలు నమ్మలేదు. అభ్యర్థి ఎంపిక విషయంలోనూ ఆయన అభిప్రాయం అడగలేదు. దీంతో అలిగిన ఆ నాయకుడు ఏకంగా వైసీపీలో చేరిపోయాడు. యథాప్రకారం మందిలో ఒకడిగా ఉనికి లేకుండా మిగిలిపోయాడు. ఆయన గత వైభవం కళ్లజూసిన తరం మాత్రం అయ్యో.. ఎట్లా బతికిన కుటుంబం.. అని నిట్టూరుస్తున్నారు.

- తడ

ఇదేంది మస్తానమ్మా.?



ఉల్లంఘనులు

ఆమె రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసిన పదవిలో ఉన్నారు. అందులోనూ అధికార భాషా సంఘం సభ్యురాలు. నెలకు లక్ష రూపాయలకు పైగా ప్రజాధనాన్ని వేతనంగా అందుకుంటున్నారు. కానీ అవేవీ ఆమెకు పట్టవు. వైసీపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే పనిగా పెట్టుకున్నారు. తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి గెలుపు కోసం ఆయన తండ్రి కరుణాకర్‌రెడ్డి చేపడుతున్న ప్రచారంలో ఈమె మహిళా కార్యకర్తలా పనిచేస్తున్నారు. ఎన్నికల నిబంధనలు తెలియనట్టు కరపత్రాలను పంచుతూ కనిపిస్తున్నారు. అంతేకాదు అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన సామాజిక వర్గాన్ని ఏకం చేసి, వైసీపీకి ఓట్లుగా మార్చే పనిలోనూ బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఆటోలకు డిమాండ్



ఎన్నికల పుణ్యమా అని ఆటోవాళ్లకి గిరాకీ పెరిగింది. రోజంతా తిరిగితే ఆరేడు వందలు చేతికొచ్చేది ఎక్కువ. ఇప్పుడు ఎన్నికల ప్రచార అవసరాల కోసం ఆటోలను పార్టీలు ముందు బుక్ చేసేసుకుంటున్నాయి. వీటిని ప్రచారరథాలుగా మార్చేసుకుని పల్లెలు తిప్పుతున్నాయి. మండలానికి పది నుంచి పదిహేను ఆటోలు ఇలా తిరుగుతున్నాయి.కొందరు ఆటోలకు డిజిటల్ స్ర్కీన్లు ఏర్పాటు చేసి అభ్యర్థులు చేపట్టిన కార్యక్రమాలు ప్రదర్శిస్తుండగా, మరి కొందరు ఆటోల్లో అభ్యర్థుల పేరున పాటలు రికార్డు చేసి వినిపిస్తున్నారు. ఎన్నికల ఆటోలకు రోజుకి వెయ్యి రూపాయలు ఇస్తున్నారు. భోజనం కూడా పార్టీలదే. దీంతో ఎన్నికలొచ్చినపుడే కదా నాలుగు రూపాయలు సంపాయించుకోవాలి అని ఎండలు మండుతున్నా లెక్క చేయకుండా ఆటోలవాళ్ల ప్రచారాల్లో బిజీగా ఉంటున్నారు. ఈ ఎఫెక్ట్ సాధారణ ప్రయాణీకుల మీద పడింది. ఆటోలు దొరకడం అటుంచి రేట్లు పెంచేశారు.

- వెంకటగిరి

తిరుమల ఘాట్‌లో జీపు బోల్తా

ఐదుగురు చెన్నై భక్తులకు గాయాలు



ప్రమాదానికి గురైన జీపు - గాయపడిన భక్తులను తరలిస్తున్న సిబ్బంది

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో ఓ జీపు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు భక్తులు గాయపడ్డారు. చెన్నైకి చెందిన ఐదుగురు భక్తులు శ్రీవారి దర్శనార్థం ఆదివారం మధ్యాహ్నం ఓ జీపులో తిరుమలకు బయల్దేరారు. మార్గమధ్యంలో జీపు అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో 50 ఏళ్ల వయసున్న ఓ మహిళకు తీవ్రగాయాలవగా, మిగిలిన నలుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రికి తరలించి, వైద్యం అందించారు. కాగా, రోడ్డుపై జీపును తొలగించి, ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

సీన్ రివర్స్

శ్రీకాళహస్తి వర్తమానం

శ్రీకాళహస్తిలో ఈసారి సీన్ రివర్సవుతోంది. ఒకసారి ఓటమి సానుభూతి.. వైసీపీ వేవ్‌లో ఎమ్మెల్యేగా గెలుపొందిన మధుసూదన్‌రెడ్డికి ప్రస్తుతం ఎదురుగాలి వీస్తోంది. విపరీతమైన అవినీతి ఆరోపణలున్నాయి. నిత్య వివాదాస్పద నేతగా ముద్ర వేసుకున్నారు. ఎవరిపైనా రానంతగా భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ, కేసులు వంటి విమర్శలు ఆయనపై వచ్చాయి.

- శ్రీకాళహస్తి



- వైసీపీ ఎమ్మెల్యేపై విపరీతమైన అవినీతి ఆరోపణలు
- ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తి
- ప్రభావత నేతల చేరికతో టీడీపీలో జోష్
- కలసివస్తున్న బీజీపీ, జనసేన మద్దతు

శ్రీకాళహస్తి వైసీపీ శ్రేణుల్లో అంతులేని అసంతృప్తి అలముకుంది. ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి వైఖరితో సొంత పార్టీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల్లో భరించలేని అసహనం, అసంతృప్తి నెలకొంది. గుర్తింపు రాకపోవడం, పదవులు దక్కకపోవడం, పనులు జరగకపోవడం వంటి కారణాలతో అసంతృప్తి పేరుకుపోయింది. గ్రూపులు పెరిగిపోయాయి. వలస నేతలకు పెద్దపీట వేయడం వీరి అసంతృప్తికి మరింత ఆజ్యం పోసింది. ఎమ్మెల్యే కుటుంబం చుట్టూ కోటరీ ఏర్పడింది. కోటరీ నేతల అతిపెత్తనంతో ఆత్మాభిమానం దెబ్బతింటోందని పార్టీ శ్రేణులు ఆవేదన చెందుతున్నాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన ముగ్గురు జడ్పీటీసీలు ఇలాంటి కారణంతోనే వైసీపీకి ఝలక్ ఇచ్చారు. ఈ అనూహ్య పరిణామంతో వైసీపీ చతికిలపడింది. గత ఎన్నికల్లో వైసీపీకి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ ముని రామయ్య, నాయకులు లక్కమనేని మధు వంటి నేతలు పార్టీని వీడారు. వైసీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా వీరంతా పనిచేస్తున్నారు. మరోపక్క భూకబ్జాలు, దాడులు, దౌర్జన్యాలు, అక్రమాల్లో ఇక్కడి ఎమ్మెల్యే తీవ్రమైన అపప్రద మూటగట్టుకున్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఎన్నికలు జరగకపోవడంతో వైసీపీలోని ఆశావాహులు భంగపడ్డారు. వార్డుల్లో చిన్నాచితకా నాయకులందరూ పార్టీకి దూరమయ్యారు. ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి నియామకాల విషయంలోను మధు విఫలమయ్యారని సొంత పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. పట్టణంలో దాడులు పెరిగిపోయాయి. స్వపక్షంలోను దాడులకు తెగబడటం పార్టీ పరువును బజారుకీడ్చింది. ప్రశాంత శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రౌడీయిజం పెరిగిందన్న ఆవేదన స్థానికుల్లో నెలకొంది. ఈనేపథ్యంలో ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలసిరాక ఎమ్మెల్యే ఎదురీదుతున్నారు.

పోటెత్తిన వలసలు

సాధారణంగా ఎన్నికలకు ముందు వలసలు మామూలే. కానీ, శ్రీకాళహస్తిలో 14నెలల ముందే మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య టీడీపీలో చేరారు. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు గతేడాది జూలైలో భారీగా అనుచర వర్గంతో సొంత గూటికి చేరారు. ముగ్గురు జడ్పీటీసీలు, ఆతర్వాత కొందరు ఎంపీటీసీలు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు ఇక పలువురు మాజీ కౌన్సిలర్లు వైసీపీని వీడారు. టీడీపీ బలం పుంజుకోవడంతో నెల రోజులుగా చేరికలు మరింత పెరిగాయి.



కూటమితో అదనపు బలం

ఎన్డీఏ కూటమితో టీడీపీ అభ్యర్థికి అదనపు బలం చేకూరింది. బలమైన ఓటు బ్యాంకు ఉన్న బలిజ సామాజిక వర్గానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, ఆపార్టీ శ్రేణులు తోడయ్యారు. జనసేన నుంచీ నేతలు, శ్రేణులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు.

బలం పుంజుకున్న సుధీర్

టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి బాగా బలం పుంజుకున్నారు. అభివృద్ధి ప్రదాతగా, పాలనాదక్షుడిగా పేరొందిన గోపాలకృష్ణారెడ్డికి వారసుడు సుధీర్ గెలిస్తే మళ్లీ ప్రశాంత వాతావరణం నెలకొంటుందనే మాట ప్రజల్లో వినిపిస్తోంది. రెండేళ్ల కిందట గోపాలకృష్ణారెడ్డి కన్నుమూశారు. ఆయన కర్మక్రియల రోజునే సోదరుడు హరినాథరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. ఇద్దరు పెద్ద దిక్కులను కోల్పోయిన సుధీర్‌కు తల్లి బృందమ్మ, భార్య రిషితారెడ్డి వెన్నంటి నిలుస్తున్నారు. ఎన్నడూ గడప దాటని ఆ ఇద్దరూ బరువైన బాధ్యతలను భుజానికి ఎత్తుకున్నారు. నియోజకవర్గంలో ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ పలుమార్లు గడప గడపను చుట్టేశారు. ఇక, గతంలో సుధీర్ రెడ్డి మాట కటువు అన్నవారే నేడు ఆయన కలుపుగోలుతనం, అభివృద్ధి పనులపై మాట్లాడే విజన్, నిజాయితీతో కూడిన విధానాలను ప్రశంసిస్తున్నారు. కేడర్‌నూ ఆయన మృదువుగా పలకరిస్తూ కలుపుకొని వెళ్తున్నారు.



ఇవేం పనులు రెడ్డెప్పా!

చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాళ్లకు మొక్కి.. ఆశీర్వాదం తీసుకోవడం దళిత వర్గాల్లో విమర్శకు దారితీసింది. మదనపల్లెలో మంత్రి నుంచి బీ ఫాం అందుకున్న రెడ్డెప్ప.. ఆయన కాళ్లకు మొక్కారు. దళితుల ఆత్మగౌరవాన్ని పెద్దిరెడ్డి కాళ్ల వద్ద పెట్టారంటూ ఆయా సంఘాలు మండిపడుతున్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

రుయా ఆవరణలో మరోసారి అగ్నిప్రమాదం

పదిరోజుల వ్యవధిలో అదే ప్రదేశంలోనే.. ● అధికారుల నిర్లక్ష్యమే కారణమంటూ అగ్నిమాపక సిబ్బంది మండిపాటు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 21: రుయాస్పత్రి ఆవరణలో ఆదివారం రాత్రి మరోసారి అగ్ని ప్రమాదం జరిగింది. పది రోజుల కిందట జరిగిన ప్రదేశంలోనే మళ్లీ అదే రీతిలో అగ్ని ప్రమాదం జరగడం గమనార్హం. సాధారణంగా ఆస్పత్రి ఆవరణలో బయో వ్యర్థాలను ఒకరోజుకి మించి నిల్వ చేయకూడదు. కానీ రోజుల తరబడి బయో వ్యర్థాలను, ఆస్పత్రిలోని ఇతర చెత్తాచెదారాన్ని ఆవరణలోని ఒకేచోట నిల్వ చేస్తున్నారు. పైగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే టీబీ వ్యాధిగ్రస్తులు చికిత్స పొందే వార్డుకు సమీపంలోనే డంపింగ్ యార్డును తలపించేలా వ్యర్థాలను నిల్వ చేస్తున్నారు. వీటికి పదిరోజుల కిందట కూడా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో టీబీ వార్డుతోపాటు ఇతర వార్డుల్లో పొగ కమ్ముకొని రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. ఆ సమయంలోనే ఇలా నిల్వ చేయొద్దని అగ్నిమాపక అధికారులు సూచించారు. కానీ రుయా అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పారిశుద్ధ్య నిర్వాహకులు తిరిగి అక్కడే యథావిధిగా వ్యర్థాలను నిల్వ చేశారు. ఈసారి కూడా గుర్తు తెలియని వ్యక్తులు మరోసారి నిప్పు పెట్టడంతో భారీ అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే మరోసారి ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బంది మండిపడ్డారు.



టీబీ వార్డు పక్కన ఎగసిపడుతున్న మంటలు

కోదండరాముడి తెప్పోత్సవాలు ప్రారంభం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 21: కోదండరామస్వామి వారి తెప్పోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయంలోని మండపంలో స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఏడు నుంచి రాత్రి 8.30 గంటల వరకు సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా రామచంద్ర పుష్కరిణికి తీసుకొచ్చారు. తొలిరోజు స్వామివారు ఐదు చుట్లు తెప్పలపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, అధికారులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభంజనం ఖాయం



తిరుచానూరులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావు

తిరుచానూరు, ఏప్రిల్ 21: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో రోజురోజుకు పెరిగిపోతున్న టీడీపీ ప్రభంజనంలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తిరుచానూరు పంచాయతీలోని రంగనాథంవీధి, వేపమానువీధి, రేణిగుంటరోడ్డు ప్రాంతాల్లో టీడీపీ శ్రేణులతో కలిసి వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా ప్రజలు టీడీపీ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ వారు ఓటుకు రూ.10వేలు ఇచ్చినా ప్రజా మద్దతు తమకే ఉందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వారిని టీడీపీ నాయకులు భారీ గజమాల, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు కిషోర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, హరిరాంరెడ్డి, దామినేడు రమేష్, సాల్మాన్‌రాజు, కలీమ్, మోహన్‌రెడ్డి, రమణరాయల్, జనసేన వెంకట్‌రాయల్, బీజేపీ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వు



చంద్రగిరి 50 పడకల ప్రభుత్వాస్పత్రి భవనం

చంద్రగిరిలో వంద పడకల ఆస్పత్రి

"పాలనా కేంద్రంగా చరిత్ర కలిగిన చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు చేయిస్తా."

- చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే

గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ఈ హామీ ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. 1999-2004 నడుమ టీడీపీ ప్రభుత్వం ఇక్కడ వంద పడకల ఆస్పత్రికి తగిన భవనాలు నిర్మించింది. అయితే తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. అప్పటి ఎమ్మెల్యే గల్లా అరుణకుమారి 2006లో ఇదే భవనంలో 30 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వంలో ఆస్పత్రి స్థాయిని 50 పడకలకు పెంచుతూ పులివర్తి నానీ జీవో తెప్పించారు. ఇప్పటికీ అదే స్థాయిలో ఆస్పత్రి నడుస్తోంది. గత ఎన్నికల్లో ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతానని హామీ ఇచ్చిన చెవిరెడ్డి ఈ ఐదేళ్లలో దాని గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వంలో తనకున్న పలుకుబడితో తుడా ఛైర్మన్‌గా, ప్రభుత్వ విప్‌గా, టీటీడీలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పదవులకు మాత్రం జీవోలు తెప్పించుకున్నారు. అలాగే తన కుమారుడిని తుడా ఛైర్మన్‌గా నియమిస్తూ కూడా జీవో తెప్పించుకోగలిగారు. అదే సమయంలో పది మందికీ పనికొచ్చే ఆస్పత్రి స్థాయి పెంపు విషయంలో జీవో తీసుకురాకుండా హామీ మరచిపోయారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ప్రకటించింది. శనివారం 73,051మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 34,599మంది తలనీలాలు సమర్పించారు.

జన చైతన్యం

సోమవారం 22 ఏప్రిల్ 2024

ఇదీ సందడి

అంటే... ఆయప్ప మొనగోడు కాడా!!



'అయితే ఆయప్ప మొనగోడు కాడా..' అనేసి డౌట్ కొట్టింది అక్కడున్నోల్లందరికీ. చెప్పిందంతా ఇన్నాక మీగ్గూడా అదే డౌట్ కొడితే తప్పు మీది, నాదీ కాదు. అసలు కతేందంటే.. ఆ మజ్జన మంత్రి పెద్దిరెడ్డి ఎకాఎకిన కుప్పం వొచ్చీరావటంతోనే మీటింగు పెట్టేసినాడు ఒరిద్దరు నాయకులు మాటలతో ఊదరగొట్టేసినాక, ఆయప్ప పైకిలేచి నిలబడినాడు. మైకు చేతిలోకి తీసుకోని కుడిఎడమల్లో కూకోనుండిన ఎమ్మెల్సీ భరత్‌ను, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌ను తలకాయ ఈపక్కా ఆపక్కా తిప్పి చూసినాడు. గొంతు సవరించుకోని చంద్రబాబు పాలన ఎంత అసింకమో చెప్పినాడు. మాటల మజ్జలో మళ్లీ మంత్రిగారు ఒకపారి భరత్‌ను, సెంథిల్‌ను సూసి వోల్లిద్దరినీ దెగ్గిరికి పిల్సినాడు. సెంథిల్ బుజంమింద చెయ్యేసి ప్రేమగా నిమిరినాడు. 'ఇదిగోప్పా సెందిలా, బారమంతా నీమీదనే పెడ్తావుండా. మన భరత్‌ను నువ్వే గెలిపించుకోవల్లప్పా..' అనేసినాడు. ఆడితో ఊరుకుండ్లా. సెందిల్ సేతిని తీసి, భరత్ సేతిలో పెట్టి 'ఈల్లిద్దురూ ఫ్రెండ్స్. నాకు తెలుసు, మన భరత్ సెంద్రబాబుమింద గెలస్తావుండాడు.' అని ఆయప్పకు ఆయప్పే ధైర్నం చెప్పేసుకున్నాడు. 'ఇదేందప్పా ఈ పెద్దాదయన..? సెందిల్ గెలిపించాల అని చెప్తాడు. అయితే భరతన్న మొనగోడు గాదా..' అనే డౌటు ఆ మీటింగులో ఉన్న శానామందికే వొచ్చింది కానీ, పెద్దిరెడ్డిని అడిగేటంతటోల్లు ఎవురుండారు జెప్పండి. కొసమెరుపేందంటే.. 'న్నో.. నాకు అరవయ్యో, డెబ్బయ్యో బూతులిచ్చిండారు. మీరు జెప్తావున్నట్టు మెజారిటీలు తెచ్చేకి లేదు. టీడీపీతో ఈక్వల్ చేసేకి మాత్రం జూస్తా' అనేసి ఇదే సెందిల్ పెద్దిరెడ్డితో మూడ్నాలుగు రోజుల కిందట తెగేసి చెప్పేసినాడని అంతా అనుకుంటా ఉండారు.

- కుప్పం

మీ ఓటు సీఎంకే!

కుప్పంలో టీడీపీ శ్రేణుల వినూత్న ప్రచారం



ఆయప్పకు ఓటేస్తే సీఎం అవుతాడు ...ఈయప్పకు ఓటేస్తే లాభమేమి అన్న చర్చ కుప్పం నియోజకవర్గంలో విస్తృతమౌతోంది. సీఎం అయ్యే అయప్పకు ఓటేస్తే మన ఊర్లు బాగుపడతాయి, మన చిన్నోళ్లకు ఉద్యోగాలు, పనులు దొరుకుతాయి, ఓడిపోయే వ్యక్తికి ఓటు వేస్తే కదా అన్న వాదనలు కూడా బలంగా విన్పిస్తున్నాయి. కుప్పం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా టీడీపీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఓటర్లు తమ ఓటుహక్కు నియోజకవర్గ అభివృద్ధికే కాకుండా, రాష్ట్ర అభివృద్ధికి కూడా దోహదం చేస్తుందని వారు ఓటర్లుకు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకతకు తోడు, టీడీపీకి జనసేన, బీజేపీ తోడవడంతో రాష్ట్రంలో తిరిగి టీడీపీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఖచ్చితంగా ఏర్పడుతుందని వారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని వారు ఓటర్లుకు పదేపదే గుర్తు చేస్తున్నారు. చంద్రబాబుపై కుప్పం నియోజకవర్గంలో గత ఏడుసార్లు ఎవరూ గెలవలేకపోయారని, రానున్న ఎన్నికల్లో సైతం చంద్రబాబు విజయాన్ని ఏ శక్తి అడ్డుకోజాలదని వారు చెబుతున్నారు. మళ్లీ మరోసారి సీఎం అయ్యే చంద్రబాబుకు ఓటు వేయాలని కోరుతున్నారు. వైసీపీ వాళ్లేమో కుప్పంలో భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తానని జగన్ చెప్పిన మాటను ప్రచారం చేస్తున్నారు. అధికారంలోకి రాని పార్టీలో మంత్రి ఎట్లవతాడంటూ టీడీపీ వాళ్లు తిరగ్గొడుతున్నారు. పైగా కుప్పం నియోజకవర్గంపై జగన్‌కి అంత ప్రేమే ఉంటే భరత్ ఎమ్మెల్సీగా ఎన్నికైన వెంటనే మంత్రిని చేసి ఉండవచ్చు కదా అని ప్రశ్నలు సంధిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని టీకొట్లు, రచ్చబండల మీద ఇవే మాటలు వినిపిస్తున్నాయి.

- రామకుప్పం

డిపాజిట్ దక్కడం అంటే...!

నోట్ దిస్ పాయింట్

'ఎన్నికల్లో మనోడికి డిపాజిట్ దక్కలేదు బాసూ' అనే మాట వింటూ ఉంటాం. ఇంతకీ డిపాజిట్ దక్కకపోవడం అంటే ఏమిటో తెలుసా? ఎన్నికల్లో పోటీ చేసేవారు 1951 ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం కొంత డబ్బు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల్లో అయితే జనరల్ కేటగిరి వాళ్లు రూ 10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ 5 వేలు డిపాజిట్ కింద చెల్లించాలి. ఎంపీ అభ్యర్థులైతే 25 వేలు, రిజర్వేషన్ స్థానాల్లో అయితే 12.5 వేలు చెల్లించాలి. నామినేషన్ వేసే సమయంలో ఈ సొమ్ము చెల్సించాల్సి వుంటుంది. ఓట్లు లెక్కింపు పూర్తి అయిన తర్వాత విజయం సాదించిన వారి వివరాలు ప్రకటిస్తారు. పోలైన ఓట్లల్లో ఆరింట ఒకవంతు అంటే 16.6 శాతం ఓట్లు సాధించిన వారికి కట్టిన డిపాజిట్ సొమ్ము వెనక్కి తిరిగి ఇచ్చేస్తారు. మిగిన వారికి ఇవ్వరు. అందుకే డిపాజిట్ కూడా దక్కలేదు అంటారు.

- చిత్తూరు కలెక్టరేట్

ఓం శక్తికి నమస్కరించి.. నామినేషన్ సమర్పించి..



● సెంటిమెంట్

పలమనేరులో ఎన్నికల బరిలో నిలిచే వార్డు సభ్యుడి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి వరకూ నామినేషన్ సందర్భంలో ఓ సెంటిమెంట్‌ను కచ్చితంగా అనుసరిస్తారు. పలమనేరు ఈశాన్యంలోని ఎద్దుల చెరువు దగ్గరున్న ఓం శక్తి ఆలయం వద్ద పూజ చేశాకే నామినేషను వేయడానికి బయలుదేరుతారు. నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ సమర్పిస్తారు. ఈ ఎన్నికల్లో ఇప్పటికే వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే వెంకటేగౌడ ఈ సంప్రదాయాన్ని పాటించారు. అలాగే, సోమవారం టీడీపీ అభ్యర్థి అమరనాథరెడ్డి నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా ఆయన కూడా ఆలయంలో పూజలు చేసి.. అక్కడ్నుంచి ఆర్వో కార్యాలయానికి వెళ్లి నామినేషన్ సమర్పించనున్నారు.

- పలమనేరు

పరిమితికి మించి తవ్వుకో.. ఇష్టమొచ్చిన రేటుకు అమ్ముకో.. ఎక్కడికైనా తరలించుకో.. ఇలా జిల్లాలో ఐదేళ్లుగా ఇసుక దోపిడీ సాగింది. అధికార పార్టీ అండతో నిబంధనలకు పాతరేసి నదులను బావుల్లా తవ్వేశారు. నీవా నదిలో రైతుల బావులు, బోర్లు, పైపులైన్లు పెరికేసి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. పక్క రాష్ట్రాలకే ఎక్కువగా తరలిస్తున్నారు. స్థానికంగా అందుబాటులో తక్కువ. ఉన్నా అమితమైన రేటు. దీని ప్రభావం పేదల ఇళ్లపై పడింది. ఇసుక భారం వల్లే చాలాచోట్ల ప్రభుత్వ ఇళ్లు కట్టుకోలేక పేదలు ఇబ్బంది పడుతున్నారు.

టీడీపీ హయాంలో ఇసుక ఉచితం. రవాణా చార్జీలు మాత్రమే ఇళ్ల నిర్మాణదారులు భరించాలి. వైసీపీ వచ్చేసరికి పేదలకు ఇసుక భారం కావడంపై ప్రత్యేక కథనం. - చిత్తూరు రూరల్



తవ్వుకో.. అమ్ముకో

● ఐదేళ్లూ ఇసుక దోపిడీ

ట్రాక్టరు ఇసుక రూ.5 వేలపైనే

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశారు. స్థానికుల అవసరానికి ట్రాక్టరు ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.వెయ్యి నుంచి రూ.1500కు వచ్చేది.

● వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉచిత విధానానికి మంగళం పాడారు. ఇప్పుడు ట్రాక్టరు ఇసుక రూ.5 వేలకు పైగా ఉంటోంది. నిరుపేదలు చిన్న గది నిర్మించుకోవాలన్నా ఇసుక కొనలేని పరిస్థితి.



నీవా నదిలో ఇసుక లేకుండా తోడేశారిలా..

శ్మశానాన్నీ వదల్లేదు



అనంతాపురం రీచ్.. నీవా నది ఒడ్డున స్థలాన్ని స్థానికులు శ్మశాన వాటికగా వాడుతున్నారు. ఈ శ్మశాన స్థలాన్నీ తవ్వేశారు. ఈ తవ్వకాల్లో అస్తిపంజరాలు, ఎముకలు బయట పడుతుండటంపై స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

యంత్రాలతో తవ్వేస్తూ..

టీడీపీ హయాంలో ఇసుక రీచుల్లోకి యంత్రాలకు అనుమతి లేదు. కూలీల ద్వారానే తవ్వుకోవాలి. తద్వారా ఒక్కో కూలీకి రోజుకు రూ.వెయ్యి వరకు కూలీ లభించేది. ఎవరైనా ట్రాక్టర్ల ద్వారానే ఇసుక తీసుకెళ్లాలి. టిప్పర్లకు అనుమతి లేదు. దీనివల్ల ఇసుకను అవసరానికి మించి అపరిమితంగా తవ్వి తరలించే వీలు ఉండేది కాదు.

- వైసీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి మారిపోయింది. ఎక్స్‌కవేటర్లు, హిటాచీలతో బావుల్లా తవ్వేస్తున్నారు. ఇసుక రీచుల్లో ట్రాక్టర్ల కన్నా టిప్పర్లే ఎక్కువ కనిపిస్తున్నాయి.



రీచ్‌లో టిప్పర్లతో ఇసుక తరలింపు



బావిని తలపిస్తున్న అనంతాపురం రీచ్

నిబంధనలకు పాతర

సాధారణంగా ఇసుక రీచుల్లో రెండు నుంచి మూడు మీటర్ల మేరకే తవ్వుకునేందుకు అనుమతిస్తారు. అంతకుమించి తవ్వకూడదు.

- వైసీపీ ప్రభుత్వంలో మాత్రం రాష్ట్రంలో ఇసుక అమ్మకాలను కేటాయించిన సంస్థకు.. ఎంత లోతు వరకు తవ్వాలనే అంశంపై ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. దీనిని అడ్డం పెట్టుకుని యంత్రాలతో ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు, అనంతాపురం రీచుల్లో 20 అడుగులకుపైనే ఇసుక తవ్వేశారు. దీనిపై చుట్టు పక్కల గ్రామస్తులు, రైతులు ఫిర్యాదులు చేసినా.. అధికార పార్టీ అండ ఉండటంతో అధికారులు పట్టించుకోలేదు.

జగనన్న ఇళ్లకు ఉచిత ఇసుకేదీ?

జగనన్న కాలనీల్లో ఇల్లు నిర్మించుకునే వారికి ఉచితంగా ఇసుక అందించాలి. దీనికోసం అధికారులు ఇచ్చే పర్మిట్లు తీసుకుని వెళితే ఇసుక ఇవ్వడం లేదు. నిల్వ లేదంటూ పంపేస్తున్నారు. వైసీపీ నాయకులు మాత్రం నిత్యం వందలాది టిప్పర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సకాలంలో ఇసుక దొరక్క లబ్ధిదారులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఎక్కువ డబ్బు చెల్లించి ఇసుక తెచ్చుకుంటున్నారు.

తమిళనాడులో నిషేధం

పర్యావరణ పరిరక్షణ.. భూగర్భ జలాలను కాపాడుకునేందుకు తమిళనాడులో ఇసుక తవ్వకాలపై నిషేధం విధించారు. కర్ణాటకలో ఇసుక లభ్యత తక్కువ. దీంతో ఆ రెండు రాష్ట్రాల్లో ఇసుకకు డిమాండు ఎక్కువ. దీనిని అధికార పార్టీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక పెద్ద టిప్పర్ ఇసుక ధర తమిళనాడు, కర్ణాటకకు తీసుకెళ్తే రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతోంది. దీంతో స్థానిక ప్రాంతాల్లో ఇసుక అందించేందుకు వారు సుముఖత చూపడం లేదు. రాత్రికి రాత్రే ఇసుకను సరిహద్దులు దాటించేస్తున్నారు. అధికారపార్టీ అండదండలు ఉండటంతో పోలీసులూ పట్టించుకోవడంలేదు. ఇసుక దొరక్క స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

రైతులపైనే కేసులు పెడతామని బెదిరింపు

చిత్తూరు మండలం అనంతాపురం రీచ్‌లో ఇష్టానుసారంగా ఇసుక తవ్వేస్తున్నారని, భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయని గతేడాది రైతులు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. రైతులపైనే కేసులు పెడతామని బెదిరింపులకు దిగారు. భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తుండటంతో గ్రామీణ రోడ్లు పాడైపోయాయని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక కొనుక్కోలేక..!



టీడీపీ ప్రభుత్వంలో ఇల్లు మంజూరైంది. కడగాలు వరకు వేశాను. అంతలో ఎన్నికలు వచ్చి వైసీపీ అధికారంలోకి వచ్చింది. గోడలు ఎక్కించాను. బిల్లు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులను అడిగితే టీడీపీలో మంజూరైంది కదా.. బిల్లు కూడా టీడీపీ అధికారంలోకి వచ్చాకే తీసుకో అని చెప్పారు. అప్పు చేసి పూతపనైనా చెద్దామనుకుంటే ట్రాక్టరు ఇసుక రూ.3500 అంటున్నారు. అంత డబ్బులు పెట్టి ఇసుక కొనలేక, మొండి గోడలతో పనులు ఆపేశాను.

- సుధీర్, అనంతాపురం

కడగాలుతోనే ఆపేశా

ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసినా ఇసుక ధరల వల్ల పునాది వేసి ఆపేశాను. టీడీపీ ప్రభుత్వంలో రూ.800 ఇస్తే ట్రాక్టర్ ఇసుక వచ్చేది. ఇప్పుడు రూ.3500 అడుగుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఇసుకకే సరిపోయేలా ఉంది. దీంతో ఏం చేయాలో తెలియక కడగాలుతోనే నిర్మాణ పనులు నిలిపేశాం.

- వేలుమురుగన్, కుర్చివేడు కాలనీ



సేవా దృక్పథమున్న నాయకుడిని అభ్యర్థిగా ఖరారు చేయడంతో చిత్తూరు టీడీపీ పుంజుకుంది. నియోజకవర్గంలో సీనియర్ నాయకుల చేరికతో పార్టీ బలోపేతమైంది. జనసేన, బీజేపీల పొత్తు శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఫుల్ జోష్‌తో గెలుపుపై గురిపెట్టింది. అదే సమయంలో వైసీపీ శిబిరంలో విజయంపై ధీమా సడలింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

గెలుపుపై 'గురజాల' గురి

- ట్రస్ట్ సేవలతో కూడగట్టుకుంటున్న ప్రజాదరణ
- అందరినీ కలుపుకొంటూ వడివడిగా ప్రచారం
- నేరచరిత్ర విజయానందరెడ్డికి ప్రతికూలం
- డీలా పడిన వైసీపీ శిబిరం


చిత్తూరు వర్తమానం

గురజాల దూకుడు



గుడిపాల మండలానికి చెందిన గురజాల జగన్మోహన్ బెంగళూరులో రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడ్డారు. ఏడాది కిందట చిత్తూరుకు తిరిగి వచ్చి జీజేఎం ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటారనే పేరు సంపాదించారు. ఇది ఆయనకు ప్రధానమైన సానుకూలాంశం. చంద్రబాబు, లోకేశ్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పే ఆయన పార్టీలో పదవిని ఆశించకుండా పని చేస్తూ వచ్చారు. ఆరుగురు నేతలు టీముగా ఏర్పడి, తమలో ఎవరికి టికెట్ వచ్చినా కలసి పనిచేస్తామనే ఒప్పందంతో ప్రచారంలోకి దిగారు. సేవా కార్యక్రమాలకు గుర్తించి టీడీపీ అధిష్ఠానం గురజాలకు టికెట్ ఇచ్చింది. టికెట్ వచ్చాక నియోజకవర్గంలోని నాయకులందరినీ కలుపుకొన్నారు. సానుకూల వైఖరి, మాటతీరుతో ఆకట్టుకుంటున్నారు. అభ్యర్థిపరంగా అనుకూలతలు పార్టీ కేడర్‌ను ఉత్సాహంగా పనిచేసేలా చేస్తున్నాయి. ఈసారి చిత్తూరులో టీడీపీ జెండా ఎగరేయడమే లక్ష్యంగా వీరంతా ముందుకు కదులుతున్నారు. ఒకప్పుడు నియోజకవర్గంలో తమ ముద్ర వేసిన సీనియర్ నాయకులంతా పార్టీ విజయానికి చొరవ చూపుతున్నారు. ఇప్పటికే దొరబాబు, చంద్రప్రకాష్, కటారి హేమలత, కాజూరి బాలాజీ, గుడిపాల బాలాజీ, వసంత్‌కుమార్, ఆయా మండలాల అధ్యక్షులు పార్టీ గెలుపు కోసం పనిచేస్తున్నారు. గురజాలను అభ్యర్థిగా ప్రకటించాక మాజీ ఎమ్మెల్యే సీకేబాబు, ఏఎస్ మనోహర్.. కూటమిలో భాగంగా జనసేన నుంచి ఆరణి శ్రీనివాసులు వర్గం, బీజేపీ నుంచి మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ఎన్‌పీ వెంకటేశ్వర చౌదరి తదితరులు టీడీపీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నారు.

తెరపైకి విజయానందరెడ్డి నేరచరిత్ర



జీడీనెల్లూరు నియోజకవర్గం ఎస్‌ఆర్‌పురం మండలానికి చెందిన వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి ఎర్రచందనం స్మగ్లర్‌గానే చిత్తూరు ప్రజలకు పరిచయం. ఇటీవల దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్ లోనూ తనపై 12 ఎర్రచందనం అక్రమ రవాణా కేసులు, ఓ మద్యం అక్రమ రవాణా కేసు ఉన్నట్లు ఆయనే ప్రకటించడం విశేషం. 2014లో ఆయన పీలేరు సబ్‌జైలుతో పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా గెలిచినా, ఆయనకు వ్యతిరేకంగా ఉంటూ.. పవర్ సెంటర్‌గా మారారు. ఈసారి టికెట్ కోసం ముందు నుంచే ప్రణాళికలు రచించారు. దీని కోసం ప్రజాకర్షక కార్యక్రమాలు చేపట్టినా.. అదంతా అక్రమ సంపాదనే కదా అని చిత్తూరు ప్రజలు భావిస్తున్నారు. విజయానందరెడ్డికి టికెట్ వచ్చాక సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి జనసేనలో చేరారు. మరికొందరు ప్రధాన నేతలు వైసీపీలోనే ఉన్నా.. ఆ పార్టీ విజయానికి చిత్తశుద్ధితో కృషి చేయడం లేదంటున్నారు. చాలామంది వైసీపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆయన అభ్యర్థిత్వాన్ని అంగీకరించకలేక పోతున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

చల్లా కుటుంబంలో ముచ్చటగా మూడోతరం

పుంగనూరు, ఏప్రిల్ 21: తన కుటుంబంలో మూడో తరం తరఫున పోటీకి సిద్ధమయ్యారు చల్లా రామచంద్రారెడ్డి. తాత, తండ్రి తరహాలో తానూ చట్టసభకు ఎన్నికై వారసత్వం సత్తా చాటాలని కృతనిశ్చయంతో ఉన్నారు. 1962లో రొంపిచెర్లకు చెందిన సీకే.నారాయణరెడ్డి (చల్లాబాబు తాత) పీలేరు నుంచి సీపీఐ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.ఆ తర్వాత ఆయన కుమారుడు ప్రభాకర్‌రెడ్డి 1983, 1985 ఎన్నికల్లో టీడీపీ తరఫున రెండు సార్లు పీలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రభాకర్ రెడ్డి మృతితో ఆయన కుమారుడు రామచంద్రారెడ్డి 1989లో పీలేరు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతిలో ఓటమి చెందారు. తర్వాత పీలేరు టీడీపీ పగ్గాలు జీవీ శ్రీనాథరెడ్డికి దక్కడంతో చల్లాబాబు కుటుంబం రొంపిచెర్ల రాజకీయాలకే పరిమితమైంది. ఎంపీపీ, టీటీడీ సభ్యుడు, రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్‌గా, ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేసిన రామచంద్రారెడ్డి, రెండేళ్ల క్రితం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. నియోజకవర్గాల పునర్విభజనతో రొంపిచెర్ల పుంగనూరు పరిధిలోకి వచ్చింది. ప్రస్తుత ఎన్నికల్లో పుంగనూరు నుంచి పోటీచేసే అవకాశం ఆయనకు వచ్చింది. పూర్వపు ప్రత్యర్థి పెద్దిరెడ్డిపైనే తలపడుతున్నారు. తాత, తండ్రి తరహాలో తానూ గెలుపొంది మూడోతరం రాజకీయ వారసత్వం నిలబెట్టాలని బాబు ఉత్సాహంగా ఉన్నారు.



సీకే నారాయణరెడ్డి



ప్రభాకర్‌రెడ్డి



రామచంద్రారెడ్డి

వైభవంగా రథోత్సవం

అడుగడుగునా భక్తుల కర్పూర నీరాజనాలు



రథం లాగుతున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

చిత్తూరుకల్చరల్, ఏప్రిల్21: నగరంలో ప్రాశస్త్యం పొందిన కోదండ రామాలయంలో ఎనిమిది రోజులుగా శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వి.ఆర్ రాజేశ్వరి, వి.ఎస్. రఘుపతిశెట్టిల ఉభయంతో రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మూలవర్లను రథంపై అధిష్ఠింపచేసి మాడవీథులు, చర్చివీధి, మార్కెట్ చౌక్, బజారు వీధి, హైరోడ్డు, గాంధీచౌక్‌ల గుండా ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు తమ లోగిళ్ల ముందు పసుపునీటితో స్వాగతం పలికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు పలికారు. శ్రీరామభక్తులు, విశ్వహిందూపరిషత్ సభ్యుల జైశ్రీరామ్ నినాదాలతో నగరం మారుమోగింది. భక్తులు బొరుగులు, ఉప్పు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో సుబ్రమణ్యంనాయుడు, అర్చకుడు వేణుగోపాల్, పాలకమండలి మాజీ చైర్మన్లు నందగోపాల్‌శెట్టి, సకల వెంకటేశం గుప్తాతో పాటు ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.టి.రంగనాథన్ వీహెచ్‌పీ నాయకులు వేలు, మురళి తదితరులతోపాటు భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం దారి వెంబడి దాతలు భక్తులకు చల్లటి మజ్జిగ, తాగునీరు, అన్నదానం చేసారు. సాయంత్రం స్వామివారికి వి.నాగేంద్రప్రసాద్, కె.జగదీశ్ కుమార్ ఉభయంతో తోట ఉత్సవం నిర్వహించారు. సోమవారం స్వామివారికి పల్లకిలో వెన్నకృష్ణుడి అలంకారం, అశ్వ వాహనసేవ నిర్వహించనున్నారు.

కోలావూరులో సీతారాముల కల్యాణోత్సవం

గుడిపాల, ఏప్రిల్ 21: మండలంలోని బసవాపల్లి పంచాయతీ కోలావూరులో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయదారులుగా జీజేఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, చిన్నబ్బ నాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కన్యాదానం, మాలలు మార్చుట, తలంబ్రాలు పోయడం వంటివి పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు పసుపు, కుంకుమ, బొందారాలను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉదయ మధుసూదన్ నాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు ధనుంజయ నాయుడు, చిత్తూరు జనసేన పార్టీ అధ్యక్షుడు దయారాం, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


కల్యాణోత్సవానికి ఉభయదార్లుగా కూర్చున్న నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు, చిన్నబ్బ నాయుడు కుటుంబసభ్యులు

ప్రజల ఆశీస్సులతో విజయం సాధిస్తా : గాలి భాను

పుత్తూరు అర్బన్/నగరి, ఏప్రిల్ 21: నగరి నియోజకవర్గ ప్రజల ఆశీస్సు లతో రానున్న ఎన్నికల్లో విజయం సాధిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం విజయవాడలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు చేతుల మీదుగా ఆయన బీఫాం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక, అవినీతి పాలన తో విసిగిపోయిన నియోజకవర్గ ప్రజలు వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో విశేష స్పందన వస్తోందన్నారు.


పాదిరేడులో కరపత్రం అందజేస్తున్న నాయకులు

వైసీపీ అరాచకాలతో ప్రజల్లో మార్పు

వడమాలపేట : వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు స్వస్తి పలికే మార్పు ప్రజల్లో ప్రారంభమయిందని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి దాము యాదవ్ చెప్పారు. పాదిరేడు పంచాయితీ పరిధిలో ఆదివారం వైసీపీ అక్రమాలు, పట్టించుకోని హామీలు, టీడీపీ చేపట్టే సంక్షేమ కార్యక్రమాల పై కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇప్పుడైనా మేల్కొని వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, హేమాద్రి నాయుడు, వెంకటయ్య, భాస్కర్‌నాయుడు, మణిరాజు, గణపతి, మాధవనాయుడు, లక్ష్మీప్రసన్న, సతీష్, బాలకృష్ణ, చందు, రాధాకృష్ణ, హేమావతి, శుభచంద్ర, సురేష్, కేతన్, రాజా, చక్ర వర్తి, లవకుమార్, శేషాద్రి, మునిశేఖర్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో పేదల జీవితాల్లో వెలుగులు



చిత్తూరు నగరంలోని 49వ డివిజన్, 32వ డివిజన్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని తెలుగుమహిళ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం విజయ కోరారు. ఆదివారం 49వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మహా శక్తి పథకంలో భాగంగా 18 ఏళ్ళు నిండిన ప్రతి స్త్రీకి 'ఆడబిడ్డ నిధి' కింద నెలకు రూ.1500, 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి రూ.15,000 'దీపం' పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని, మహిళలందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో 45 46 47 48 డివిజన్ ఇన్చార్జ్‌లు కంద, కుప్పన్, ఈశ్వర్, సురేష్, దిలీప్ జాని అశోక్ తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో ప్రచారం

టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని స్థానిక 32వ డివిజన్ సీనియర్ నాయకురాలు హేమావతి కోరారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే నియోజకవర్గంలో మౌళిక వసతుల కల్పన, అభివృద్ధి జరుగుతుందన్నారు.

గుడిపాల : టీడీపీ అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఒక్కో విద్యార్థికిగాను రూ.15 వేలు చొప్పున చెల్లిస్తారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి గురజాల ప్రతిమ అన్నారు. ఆదివారం వసంతాపురం పంచాయతీలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వసంతాపురం ఎంపీటీసీ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ దీపశ్రీ, మాజీ జడ్పీటీసీ సుమతి, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఉదయ, టీడీపీ నాయకులు బాబురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


వసంతాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

రైతులకు మేలు చేసిందేమిటి?

ప్రభుత్వానికి చెరకు రైతుల సూటిప్రశ్న



చెరకు నరుకుతున్న కూలీలు(ఫైల్ ఫొటో), మూతపడివున్న నింద్రలోని నేతమ్స్ చక్కెర కర్మాగారం

నగరి ఏప్రిల్21: ముఖ్యమంత్రి జగన్ రైతులపక్షపాతి అని చెప్పడమే తప్ప ఆయన ప్రభుత్వ హయాంలో చెరకు రైతులకు చేసిందేమిటని ప్రశ్నిస్తున్నారు. బుచ్చినాయుడుకండ్రిగ సమీపంలో గల మయూర చక్కెర కర్మాగారం ఐదేళ్ల క్రితం మూతబడగా నేటికీ రైతులకు రూ.18 కోట్లు బకాయిలు చెల్లించలేదు. అలాగే నింద్ర పరిధిలోని నేతమ్స్ చక్కెర కర్మాగారం పరిధిలోని ఏడు మండలాల రైతులకు రూ.36 కోట్ల బకాయిలు ఆగిపోయాయి. రైతులు ఏడాది కష్టపడి పండించిన పంటను క్రషింగ్‌కు తరలించి ఐదేళ్లు పూర్తయినా బిల్లులు రాకపోవడంతో అప్పులపాలై కూలీలుగా మారారు. నగరి మండల పరిధిలోని అయనంబాకం గ్రామానికి చెందిన చెరకు రైతు శేషగిరి తన 12 ఎకరాల పొలాన్ని అమ్మి అప్పులు తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంత్రి రోజా దృష్టికి చెరకు రైతు సంఘ నాయకులు పలుసార్లు తీసుకువచ్చినా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు జిల్లాలో నాడు నాలుగు ప్రైవేటు పరిశ్రమలు, రెండు సహకారరంగంలో పరిశ్రమలుండేవి. నేడు కేవలం ఒకే పరిశ్రమ ఉండటంతో చెరకు రైతులు దళారుల చేతులలో దగా పడుతున్నారు. పైసా మిగలక పోయినా పర్వాలేదు, సాగైన పంట బయటకు వెళితే చాలు అన్న రీతిలో 2023–24 క్రషింగ్ సీజన్‌లో తీవ్ర నష్టాలకు గురయ్యారు. ఇదేనా రైతుల పక్షపాతి ప్రభుత్వమంటే జగన్‌రెడ్డి, రోజా మేడమ్ అని రైతులు వాపోతున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



వడమాలపేట, ఏప్రిల్ 21: శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సీతారాముల ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. పట్టుపీతాంబరాలు, పూలమాలలతో అలంకరించి వేదపండితులు రఘునాథ శర్మ, విజయ్ కుమార్ మాంగళ్యధారణ చేయించారు.

నింద్ర మండలంలో కాంగ్రెస్ ప్రచారం



నింద్ర, ఏప్రిల్ 21: నింద్ర మండలంలోని ఇరుగువాయి జీఎన్‌కండ్రిగ, బీజీ కండ్రిగ, అరూరు, కైపాకం, పాదిరి, కలియంబాకం, అత్తూరు, ఓరూరుపేట, ఎంఅగరం, కచరవేడు, నేట్టేరి గ్రామాల్లో ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థి రాకేష్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రటరీ ఆర్.బాబు, ఉదయ్ కుమార్, సుబ్రమణ్యం, కైలాసం, పరంధామన్, పుహలేంది, పీసీసీ సభ్యులు నటరాజ మెదలియార్, చిరంజీవి రెడ్డి, ఎస్సీ నాయకులు రత్నం, నగరి రూరల్ ప్రెసిడెంట్ కుమార్, పుత్తూరు పార్టీ అధ్యక్షుడు లోహితరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ముస్లింలు, దళితులు



బంగారుపాళ్యం, ఏప్రిల్ 21: మండలంలోని మైనార్టీలు, దళితులు, బీసీలు సుమారు 300 మంది బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్నకుమార్ ఇంటి వద్ద కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పూతలపట్టు కాంగ్రెస్ అభ్యర్థి ఎం.ఎస్.బాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాదర్ బాషా, ఫాలుద్దీన్, అశోక్, కౌషా, యాస్మిన్ తదితరులున్నారు.

నాటుసారాపై ఉక్కుపాదం : డీఎస్పీ

విజయపురం, ఏప్రిల్ 21: నాటుసారా తయారీ, అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నట్టు నగరి డీఎస్పీ నరసింహమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కేవీపురంలో నాటుసారా స్థావరాలపై జరిగిన దాడిలో 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఏడు డ్రమ్ముల్లో నిలువ జేసిన బెల్లం ఊట సుమారు 1500 లీటర్లను ధ్వంసం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ నాటుసారా తయారు చేస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్వాధీనం : ముగ్గురి అరెస్టు

గుడిపాల : మండలంలోని రాసనపల్లి పరిసర ప్రాంతాల్లో ఆదివారం డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డితోపాటు గుడిపాల పోలీసులు దాడులు నిర్వహించారు. అమ్మకానికి సిద్ధంగా వున్న వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సుమారు 200 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. సారా విక్రయిస్తున్న రాసనపల్లికి చెందిన జస్టిన్, అరుణ్, సంపత్‌లను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీకి స్వస్తి పలికాలని, లేనిపక్షంలో పీడీ యాక్టులు పెట్టి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో గుడిపాల ఎస్ఐ శ్రీనివాసరావు, కాణిపాకం ఎస్ఐ రామ్మోహన్, తవణంపల్లి ఎస్ఐ సుధాకర్, పోలీసులు పాల్గొన్నారు.


రాసనపల్లిలో స్వాధీనం చేసుకున్న సారా, నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి

శాస్త్రోక్తంగా ప్రదోషకాల పూజ



వెదురుకుప్పం, ఏప్రిల్ 21: డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువైన జ్ఞానప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రదోషకాల పూజ జరిగింది. ఏకకాలంలో కొండ మల్లీశ్వరస్వామి, నందీశ్వరునికి ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణ, హారతి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఇచ్చారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



కార్వేటినగరం, ఏప్రిల్ 21: కార్వేటినగరం మండలం కోదండ రామాపురం ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేసి ఈనెలలో పదవీ విరమణ చేయనున్న పొన్ను రంగంను ఆదివారం సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో డీఈవో దేవరాజులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి



బంగారుపాళ్యం, ఏప్రిల్21: ఎన్నికల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌లను గెలిపించాలని కోరుతూ ఆదివారం బంగారుపాళ్యంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్‌నాయుడు, పట్టణ అధ్యక్షుడు రాధాకృష్ణమ నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరీఫ్ బాషా, నాసీర్ ఖాన్, రమేష్, బుజ్జి, చరణ్, ఖాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

వడమాలపేట, ఏప్రిల్ 21: మండలంలోని పాదిరేడు, టీసీ అగ్రహారం గ్రామాల్లో ఆదివారం వెంకటేశ్వర వెటర్నరీ కళాశాల, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. బీవీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 365 ఆవులు, గేదెలకు పిడుదల నివారణ మందు స్ప్రే చేశారు. 102 దూడలకు నట్టల నివారణ మందులు తాగించారు. 60 పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ వీణ, డాక్టర్ నాగేంద్రరెడ్డి, పశువైద్య విద్యార్థులు, డాక్టర్ మురళీధర్ రెడ్డి, లోకనాథం, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బైండోవర్ కేసు ఉల్లంఘనపై విచారణ

చిత్తూరు, ఏప్రిల్ 21:ఈస్టు సర్కిల్ పరిధిలోని రెండు పోలీసు స్టేషన్ల పరిధిలో ఘర్షణలకు పాల్పడి బైండోవర్ కేసుల్లో నిందితులుగా ఉన్నవారు తిరిగి కేసును ఉల్లఘించడంపై తాలూకా సీఐ కుళ్లాయప్ప చర్యలు చేపట్టారు. ఆదివారం బైండోవర్ కేసుల్లో ఉన్న ఎన్ఆర్ పేట పోలీసుస్టేషన్ పరిధికి చెందిన ప్రశాంత్, తాలూకా స్టేషన్ పరిధిలోని చౌటపల్లెకు చెందిన శివశంకర్‌లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి వద్ద హాజరుపరిచారు. ఈ నెల 25వ తేదీ విచారణకు హాజరవ్వాలని తహసీల్దార్ నిందితులను ఆదేశించారు.

కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం



కార్వేటినగరం, ఏప్రిల్ 21: కార్వేటినగరం మండలం ఎంఎం విలాసం పంచాయతీలో జీడీ నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ బాబు తన ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన ఓటర్లకు హామీ ఇచ్చారు.

పట్టుబడ్డ నగదు సీజ్

ఐరాల, ఏప్రిల్ 21: ఐరాల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం పోలీసుల తనిఖీలో రూ.60 వేలు పట్టుబడింది. ఎస్ఐ రమేష్‌బాబు పాటూరుసంత గేటు వద్ద ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. అటుగా వచ్చిన ఓ వాహనాన్ని ఎస్ఐ తన సిబ్బందితో కలసి పరిశీలించి రూ.60 వేలు నగదు ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి రశీదులు లేకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీకి మద్దతుగా సైకిల్ ర్యాలీ



శ్రీరంగరాజపురం/వెదురుకుప్పం, ఏప్రిల్ 21: టీడీపీ ఎంపీ అభ్యర్థి డి.ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ బెంగళూరు విభాగం (ఎన్ఆర్ఐలు) వారు వెదురుకుప్పం మండలం దేవళంపేట నుంచి ఎస్ఆర్‌పురం వరకు భారీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వారికి అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భీమినేని చిట్టిబాబు నాయుడు, నాయకులు లోకనాథరెడ్డి, రాహుల్, గురుసాల కిషన్‌చంద్, రావిళ్ల లోకేష్, సూరిరెడ్డి, కుమారస్వామి, భీమినేని సురేష్, గుత్త అమరాథ్, గుత్త గురుప్రసాద్, ఢిల్లీబాబు, హేమంత్, తిలక్ పాల్గొన్నారు.

నేసనూరుగట్టులో ఉచిత వైద్య శిబిరం



పుత్తూరు, ఏప్రిల్ 21 : పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేసనూరుగట్టులో ఆ గ్రామానికి చెందిన మోహన్‌రావు, శివకుమార్ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కేకేసీ హోమియో వైద్యకళాశాల సిబ్బంది సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు బీపీ, షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలు చేసి ఉచితంగా మందులను, భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ డాక్టర్లు శ్రీనివాసులు రెడ్డి, శ్రీధర్‌రాజు, సుభాషిణి రోగులను పరీక్షించారు.వాకర్స్ అసోసియేషన్‌కు చెందిన కుప్పయ్యశెట్టి, మాధవనాయుడు, సుబ్బులురాజు, రంగరాజు, ద్వారకనాథ్‌శెట్టి, గోపిరాయల్, శివశంకర్‌నాయుడు, రఘునాథరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బీ-ఫారం అందుకున్న మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబు చేతులమీదుగా పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ కలికిరి మురళీమోహన్ బి-ఫారం అందుకున్నారు. ఆదివారం ఆయన విజయవాడలోని కేంద్ర టీడీపీ కార్యాలయంలో బి-ఫారం అందుకున్నారు. డాక్టర్ మురళీమోహన్ సోమవారం మరోసారి నామినేషన్ వేయనున్నట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నేత యువరాజు నాయుడు, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి తెలిపారు.

టీడీపీలో చేరిన గోపాలకృష్ణాపురంవాసులు



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 21: మండల పరిధిలోని గోపాలకృష్ణాపురం గ్రామానికి చెందిన పలువురు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య మాట్లాడుతూ టీడీపీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావును గెలిపించాలని కోరారు. అనంతరం మాజీ ఉప సర్పంచ్ ఈ.రామయ్య, వార్డు మెంబర్ ఈ.సురేష్, వైసీపీ నాయకులు టి.చిన్న, పి.కాంతారావు, టి.నైనప్ప, ఏ.అశోక్, ఏ.కనకయ్య, కే.మురగయ్య, కే.మణి, నాదముని, టి.రాంప్రసాద్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు డి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఏ.బాలాజీ, నాయకులు పాండురంగయ్య, చిన్నా, గంగాకుమార్, గంగయ్య, మునిలక్ష్మమ్మ, కన్నయ్య, హరిగోపాల్ పాల్గొన్నారు.